ఊపందుకున్న గృహ నిర్మాణాలు

- ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేసేందుకు సన్నాహాలు
- నియోజకవర్గంలో 6087 గృహాలు మంజూరు
- 5614 నిర్మాణాలు ప్రారంభం



తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న జగనన్న కాలనీ

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు పూర్తిచేసే దిశగా తాడికొండ నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. లబ్ధిదారులకు బిల్లుల జారీలో ఎలాంటి ఆలస్యం లేకుండా గృహ నిర్మాణ శాఖాధికారులు కూడా చకచకా పనులు చేస్తుండటంతో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. తాడికొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 6087 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాగా అందులో మండలాల వారీగా తాడికొండ-1783, తుళ్లూరు-466, మేడికొండూరు-1834, ఫిరంగిపురం-1999 మంది లబ్ధిదారులు ఉన్నారు. నిర్మాణాలు ప్రారంభించిన వారు 5614 మంది కాగా ఇంత వరకూ నిర్మాణాలు ప్రారంభించని వారు 468 మంది ఉన్నారు. బిలో బేస్‌మెంట్ దశలో 2115 మంది, బేస్‌మెంట్ దశలో 1788 మంది, రూఫ్ దశలో 340 మంది, శ్లాబ్ దశలో 129 మంది, శ్లాబ్ దశ పూర్తి చేసుకున్న వారు 1171 మంది ఉన్నారు. వేసవి నేపథ్యంలో వాతావరణం అనుకూలించడం గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పంటలు చేతికొస్తుండటంతో ఇప్పుడిప్పుడే గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి. అంతా అనుకూలంగా ఉంటే ఉగాది నాటికి నూరు శాతం నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఇలా...

లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తుండగా ఇందులో బస్తా రూ. 260 చొప్పున సిమెంటు 90 బస్తాలు రూ.24,030, స్టీల్ 445 కిలోలు ధర రూ.34,920, కాకుండా 20 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తుండగా ట్రాన్స్‌పోర్ట్ చార్జీ లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. మెటీరియల్ రూపంలో ప్రభుత్వం అందించిన ధర పోను దశల వారీగా లబ్ధిదారుడికి బిలో బేస్‌మట్టం దశలో రూ.15 వేలు, బేస్‌మెంట్ దశలో రూ. 55 వేలు, రూఫ్ లెవల్ రూ. 50,000, శ్లాబ్ లెవల్ రూ.30,000, ప్లాస్టింగ్, ఇతర నిర్మాణాల పూర్తి రూ.30,000 మొత్తం కలిపి రూ.1,80 లక్షలు గృహ నిర్మాణ శాఖ ద్వారా బిల్లుల రూపంలో నేరుగా ఖాతాలకే చెల్లిస్తారు. మరుగు దొడ్డి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.12,000, లబ్ధిదారుడు కూలీగా పనిచేసుకున్నందుకు రూ.18, వేలు అందజేస్తారు. ఇది కాక అదనంగా లబ్ధిదారుడిపై భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా రూ.50 వేలు అదనపు రుణం ఇప్పించే ఏర్పాటు చేస్తుండటంతో గృహ నిర్మాణం పేదవాడికి చేరువవుతుందనే చెప్పాలి.

బిల్లులు చెల్లింపులు సత్వరమే చేస్తున్నాం



తాడికొండ మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించిన మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతంగా నిర్మాణాలు చేసుకునేందుకు సహకారం అందిస్తున్నాం. వివిధ దశలలో నిర్మాణాలు పూర్తి చేస్తున్న లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా గృహ నిర్మాణ శాఖ ద్వారా బిల్లులు సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ సహకారంతో బిల్లుల చెల్లింపులు వెంటనే జరుగుతున్న నేపథ్యంలో ఇంకా ఎవరైనా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే సత్వరమే పనులు ప్రారంభించాలి.

– ఓబుల్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈఈ, తాడికొండ

తాగునీటి పైపులైన్ల పనులు పరిశీలన



తాగునీటి పైపులైను పనులను పరిశీలిస్తున్న ఏఈ ప్రవీణ్

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం ఎస్సీ కాలనీకి తాగునీటిని సరఫరా చేసేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.5లక్షల వ్యయంతో పైపులైన్ నిర్మాణం చేపట్టారు. శనివారం ఆ పనులను కార్పొరేషన్ ఏఈ ప్రవీణ్ పఎరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో గతంలో తాగునీటి పైపులైన్ లేదని, కొత్తగా లైనింగ్ ఏర్పాటు చేస్తున్నామని, బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున కొత్త బోర్లు ఏర్పాటు చేసి డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. మరో ఐదు ఆరు రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నాయని ఆయన తెలిపారు.

పైపులైన్లకు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ ప్రాంతంలో శనివారం తాగునీటి పైపులైన్లకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. డోలాస్‌నగర్ తెల్ల క్వారీ వద్ద 8 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన జీఐ పైపులైన్ల వద్ద తుప్పు పట్టి తాగునీరు వృథాగా పోవడంతో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది గోవిందు కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. స్పందించిన డీఈ కృష్ణారెడ్డి కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బందితో మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు.

71 మంది చలపతి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో థింక్ సింక్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 71 మంది ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపల్ వి రంగారావు తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన ఎంపికలలో కంపెనీ హెచ్‌ఆర్ బృందం విద్యార్థులకు ఆప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.50 లక్షలు ఉంటుందని, విద్యార్థులు, చెన్నై, బెంగుళూరుకు చెందిన సంస్థలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ వి రంగారావు మాట్లాడుతూ కళాశాలలో ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు, ఉపాధి శిక్షణ, వ్యక్తిత్వ తరగతులు నిర్వహించి విద్యార్థులలో అవగాహన పెంపొందించడం ద్వారా ఈ ఫలితాన్ని సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ నాగ శ్రీనివారావు, ఉపాధి కల్పనాధికారి ఏ శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది అభినందించారు.

మత్తు పదార్థాల వాడకం ప్రమాదకరం



యువతకు అవగాహన కల్పిస్తున్న గోళ్లమూడి శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: మత్తు పదార్థాల వినియోగం చాలా ప్రమాదకరం అని బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక చిగురు బాలల గ్రామంలో డాన్ బాస్కో యార్‌లో యువతకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు వ్యక్తి త్వరగా బానిస అవతాడని, దాని నుంచి బయట పడడానికి చాలా సమయం పడుతుందని వివరించారు. మత్తు పదార్థాలు తీసుకునే వారికి ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కిడ్నీ వ్యాధుల సంక్రమిస్తాయని అన్నారు. మత్తు పదార్థాల బానిస అయిన వ్యక్తిని డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకు రావచ్చని అన్నారు. ఈ చికిత్సను నూజివీడులోని బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని ఇలాంటి సమస్యలతో ఉన్న విద్యార్థులు, యువత విజయవాడ పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జె.ఆంజనేయులు, బి.రమేష్, డాన్ బాస్కో యార్ యువత తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూని సందర్శించిన జగోరా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు



జగోరా విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు డాక్టర్ మహమ్మద్ సలౌహౌను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయాన్ని శనివారం ఆఫ్రికాలోని జగోరా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ మహమ్మద్ సలౌహౌ సందర్శించారు. ఆయన సిక్స్ సిగ్మా అనే అంశంపై ప్రసగించారు. సంస్థలు సజావుగా సాగేందుకు దీనిని ఎలా ఉపయోగించాలి అనే విషయమై విద్యార్థులతో చర్చించారు. సిక్స్ సిగ్మాను 1986లో మోటరోలా అనే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నపుడు అమెరికల్ ఇంజినీర్ బిల్‌స్మిత్ ప్రవేశపెట్టారని వివరించారు. సిక్స్ సిగ్మా వ్యూహ్యాలు లోపాల కారణాలను గుర్తిండం, తొలగించడం ద్వారా తయారీ నాణ్యతను మెరుగుపరచవచ్చని తెలిపారు. అనంతరం డాక్టర్ మహమ్మద్ సలౌహౌను విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ సత్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎంహెచ్‌ఎస్‌డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ హేమ దివ్య, అధ్యాపకులు సిహెచ్ బాలాజి, జగోరా విశ్వవిద్యాలయ సహ వ్యవస్థాపకుడు యౌండే కామెరూన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ, పోలీస్‌శాఖ సంయుక్త తనిఖీలు



గండాలయపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఈబీ, పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది

మంగళగిరి: నగరంలోని గండాలయపేటలో శనివారం ఎస్ఈబీ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె మణికంఠ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు నగరంలోని గండాలయపేటలో ఎస్ఈబీ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. గంజాయి కేసుల్లో పాత నేరస్తులకు చెందిన ప్రతి నివాస గృహంతోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. నగరంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, గంజాయి సేవించే వారి గురించి ఎస్ఈబీ టోల్ ఫ్రీ నెంబరు 14500లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు, ఎస్ఐ జి మల్లికార్జునరావు, పట్టణ ఎస్ఐ నారాయణలతో పాటు పలువురు ఎస్‌బీఈ, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



వడ్డేశ్వరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి సిబ్బందితో కలసి శనివారం పరిశీలించారు. మంగళగిరి ఆత్మకూరు వద్ద పంప్‌హౌస్ ప్రాంగణంలో స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు, డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలించి పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నూతక్కిలో డ్రెయిన్ నిర్మాణ పనులు, రేపల్లె కనక దుర్గ వారధి కరకట్ట వెంబడి ప్రాతూరు దగ్గర నుంచి తాడేపల్లి 2వ వార్డు వరకు 45 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణంలో చిన్నచిన్న లోపాలు కనిపించడంతో వెంటనే వాటిని పరిష్కరించాలని కాంట్రాక్టర్లకు సూచించి అక్కడ ఉన్న సచివాలయ సిబ్బందిని ఆ పని పూర్తి అయిన తరువాత తమకు తెలియజేయాలని ఆదేశించారు. వడ్డేశ్వరం కొలనుకొండను కలుపుతూ నిర్మిస్తున్న సీసీ రోడ్ నిర్మాణ పనులను వారు పరిశీలించి మరో ఆరు అంగుళం కీ వాల్‌ను పెంచాలని సూచించారు. నిడమర్రు తాడికొండ రహదారిలో జరుగుతున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను, నిడమర్రు బీసీ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఏఈలు కిషోర్, ప్రవీణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడిరోడ్డుపై హిజ్రా హడావుడి

తెనాలి మంగళగిరి రహదారిపై ట్రాఫిక్ జామ్



తెనాలి మంగళగిరి రహదారిలో తుమ్మపూడి వద్ద హిజ్రా హడావుడితో నిలిచిపోయిన ట్రాఫిక్

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తెనాలి రహదారిలో శనివారం రాత్రి ఓ హిజ్రా హడావిడి చేస్తూ కారును నిలిపివేసి రోడ్డుకు అడ్డంగా తన ద్విచక్రవాహనాన్ని ఆపి హడావుడి చేసింది. దీంతో తుమ్మపూడి వద్ద గంటకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. సేకరించిన వివరాల ప్రకారం.. కంతంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానం నుంచి భార్యాభర్తలు ఇద్దరూ కారులో వస్తుండగా తుమ్మపూడి గ్రామ శివారులో హిజ్రా నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేశారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. వెంటనే ఆ హిజ్రా కారును అడ్డుకుని భార్యాభర్తలపై దౌర్జన్యానికి దిగింది. వారు భయంతో కిందకు దిగకుండా కారులో ఉండి సమాధానం చెప్పడంతో రోడ్డుకు అడ్డుగా తన ద్విచక్రవాహనాన్ని నిలిపి పెద్ద పెద్దగా కేకలు వేస్తూ ప్రాణం పోతే ఎవరు ఇస్తారంటూ హడావిడి సృష్టించింది. కారులో ఉన్న భార్యాభర్తలు ఎంత బతిమిలాడినా వినకుండా అరగంటకుపైగా గొడవ చేసింది. స్థానిక యువకులు జోక్యం చేసుకుని కారును పక్కన పెట్టించి హిజ్రా ద్విచక్రవాహనాన్ని కూడా తీయించారు. హిజ్రా మాత్రం కారును వదలకుండా తన అనుచరులకు ఫోన్ చేసి తుమ్మపూడి రావాలని కోరింది. స్థానికులు దుగ్గిరాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక యువకులు కారు యజమానితో హిజ్రాకు క్షమాపణ చెప్పించారు. అయినా సరే ఆమె వినకుండా కారు యజమాని భార్య చెబితేనే క్షమిస్తానంటూ మొండి కేయగా ఆమె కారుదిగి అక్కడ ఉన్న హిజ్రాలకు క్షమాపణ చెప్పింది. అయినా సరే వదలకుండా అక్కయ్య సారీ అని చెప్పాలని అనడంతో చివరకు ఆ మహిళ సారీ అక్కయ్యా అనడంతో వారిని వదిలివేశారు.

క్లుప్తంగా

మాలధారణ భక్తులకు దుస్తులు అందజేత



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి మాలధారణ భక్తులకు నూతన వస్త్రాలను అందజేశారు. శనివారం దేవస్థానం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో దాత తోట శ్రీనివాసరావు ఏకదశ దీక్ష చేపట్టిన పలువురు నృసింహుని భక్తులకు గురుస్వామి మాల్యవంతం దీక్షితుల చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో తోట సాంబ, చింకా మహేష్, వినయ్ చిన్ని, శేషు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగాలకు సత్కారం



మంగళగిరి: గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడుగా ఇటీవల నియమితులైన నగరానికి చెందిన పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావును ఆత్మకూరు వైఎస్సార్ సీపీ నేతలు, చేనేత విభాగం నేతలు సత్కరించారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావును ఆత్మకూరు మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు సత్కరించారు.

వ్యాక్సినేషన్ సెంటర్ల పరిశీలన




ఫిరంగిపురం: మండలకేంద్రంలోని 1, 3 సచివాలయాల్లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెంటర్లను జిల్లా హెచ్ఈఈవో చంద్రశేఖరరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల ప్రకారం వ్యాక్సినేషన్ వేస్తున్న సెంటర్లను పరిశీలించినట్లు తెలిపారు. వ్యాక్సిన్‌తోపాటు గర్భిణులకు ఎంసీపీ కార్డులు ఇచ్చిన వివరాల రికార్డులు పరిశీలించామన్నారు. వ్యాక్సిన్ వేసినతరువాత అవసరమైన అత్యవసర సమయంలో వినియోగించే ఏఈఎఫ్ఐ ఇంజక్షన్, జింకు, పారాసిటమాల్, సొల్యూషన్ ఉన్న కిట్లను పరిశీలించినట్లు తెలిపారు. వ్యాక్సినేషన్ వివరాలు ఆర్సీఎఫ్ పోర్టల్‌లో అప్‌లోడు తప్పనిసరిగా చేయాలని ఆరోగ్యసిబ్బందికి సూచించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.


రామాలయంలో లక్ష్మీగణపతి హోమం



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండరామాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న విశేషపూజలు శనివారంతో ముగిశాయి. ఉదయాన్నే స్వామివారి ఉత్సవ మూర్తులకు అర్చకులు దివి కృష్ణమూర్తి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో రుత్వికులు నారాయణ గోవర్ధన్‌రఘురామ్, త్రినాథ్, నరసింహమూర్తిల ఆధ్వర్యంలో మండపారాధన, నవగ్రహపూజలు, కలశస్థాపన, పుణ్యాహవచనం నిర్వహించి యాగశాలలో నవగ్రహ హోమం, లక్ష్మీగణపతిహోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మూడు రోజులపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ వెలుగుల్లో నృసింహస్వామి ఆలయం







మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. నృసింహుని అలంకారాన్ని విద్యుత్ దీపాలతో తయారు చేశారు. భక్తులను ఆకర్షిస్తుంది.

– మంగళగిరి

బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచిన ఎమ్మెల్యే ఆర్కే



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న మూడు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) బాసటగా నిలిచి శనివారం రాత్రి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెంలో అనారోగ్యానికి గురై ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న బుల్లా పార్వతికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన ఆరిగ రామారావు కూలిపనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రామారావుకు ఇటీవల కాలంలో శస్త్రచికిత్స జరగడంతో రూ.20 వేలు, అదే గ్రామానికి చెందిన కోట దాసు, అతని భార్య వృద్ధాప్యంలో ఉండి అనారోగ్యం పాలు కావడంతో జీవనాధారం కష్టం కావడంతో ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాలు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డి.వి.ఆర్.) చుక్కపల్లివారిపాలెం సర్పంచ్ దాసరి సుందరమ్మ, ఈమని సొసైటీ చైర్మన్ నడికుర్తి యేసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మేరుగ ఆనంద్, దాసరి రమేష్, సాంబయ్య, పులుగునూరు సందీప్, మండ్రు అనీల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మహిళా వలంటీర్ దాడి



గాయపడిన నిమ్మలపల్లి ప్రసాద్

తాడేపల్లిరూరల్: తనపై ఫిర్యాదు చేశారని అక్కసుతో నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి-2 సచివాలయంలో పనిచేస్తున్న వలంటీర్ ఓ వ్యక్తిపై దాడిచేసింది. అతని తలకు తీవ్ర గాయమైంది. ఈ సంఘటనపై బాధితుడు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లి-2వ సచివాలయ పరిధిలోని నులకపేటలో వలంటీర్‌గా గంగాభవానీ పనిచేస్తోంది. అదే ప్రాంతంలో నివాసముండే నిమ్మలపల్లి ప్రసాద్ తాగునీటి ట్యాప్ కోసం నగదు చెల్లించాడు. రశీదు గురించి వలంటీర్‌ను ప్రశ్నించాడు. నువ్వెవరు నన్ను అడగడానికి? సచివాలయానికి వెళ్లి తెచ్చుకో అని గంగాభవాని అనడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలోనే గతంలో కూడా నామీద ఇలాగే ఫిర్యాదు చేశారంటూ రోడ్డుమీద రాయి తీసుకుని ప్రసాద్‌పై విసిరింది. ప్రమాదంలో ప్రసాద్ తలకు గాయం కావడంతో కళ్లు తిరిగి కిందపడిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వైద్య నిమిత్తం మంగళగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. సంఘటనపై తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రమేష్ విచారణ చేపట్టారు.

మేధోశక్తి పెంపుదలకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయి



మేడికొండూరు: మానవ మేధోశక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ అన్నారు. మేడికొండూరు గ్రంథాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం దేవానంద్ మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, పి.వి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మేడుకొండూరు ఎస్ఐగా పవన్



మేడికొండూరు: మేడికొండూరు పోలీసుస్టేషన్ ఎస్ఐగా మధుపవన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు కొత్తపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పవన్ సాధారణ బదిలీల్లో భాగంగా మేడికొండూరుకు వచ్చారు. ఎస్ఐ పవన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. మండలంలో సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.